చకచకా యూపీహెచ్‌సీ నిర్మాణం

- మిందిలో రూ.1.6 కోట్లతో నిర్మాణం
- త్వరలోనే అందుబాటులోకి 10 పడకల ఆస్పత్రి



మిందిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అక్కిరెడ్డిపాలెం: పేదలకు అధునాతన సదుపాయాలతో వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. వారికి చేరువలోనే నాణ్యమైన వైద్యం అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొన్ని యూపీహెచ్‌సీల్లో సేవలు ప్రారంభం కాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. అందులో భాగంగా జీవీఎంసీ 68వ వార్డు మిందిలో రూ.1.60 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యూపీహెచ్‌సీ అన్ని సదుపాయాలతో శరవేగంగా నిర్మాణం పూర్తి చేసుకుంటోంది. త్వరలోనే ఈ వైద్య కేంద్రం అందుబాటులోకి రానుందని కార్పొరేటర్ గుడివాడ అనూష తెలిపారు. ఈ పనులను ఆమె, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ పర్యవేక్షిస్తున్నారు. మిందిలోని ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా 10 పడకలతో ప్రజలకు వైద్యసేవలు అందనున్నాయి. పరీక్షలు నిర్వహించే ల్యాబ్, రక్తపరీక్షల ల్యాబ్, మెడికల్ డిస్పెన్సరీ, మందులు ఇచ్చే గది, కోల్డ్‌స్టోరేజ్ గది వంటివి ఉంటాయి. యూపీహెచ్‌సీలో నిత్యం ఇద్దరు వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు. ఒకరు పర్మినెంట్ వైద్యుడు కాగా మరొక స్పెషలిస్ట్ డాక్టర్ పర్యవేక్షిస్తుంటారు. రోజు మార్చి రోజు చిన్నపిల్లల డాక్టర్, గైనకాలజిస్ట్, చర్మవ్యాధుల డాక్టర్, ఆపరేషన్లు నిర్వహించే వైద్యులు ఈ ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంటారు. ఈ వైద్య కేంద్రం ద్వారా అక్కిరెడ్డిపాలెం, రాంనగర్, మింది, గుడివాడ అప్పన్నకాలనీ, రాజీవ్‌నగర్, కాళికానగర్, గిరిప్రసాద్‌నగర్ తదితర ప్రాంతాల్లోని సుమారు 30 వేల మంది సేవలు అందుకోనున్నారు.

త్వరలోనే వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో– ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కార్పొరేటర్ అనూష తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులకు అన్యాయం



853వ రోజు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో తీసుకుంటున్న నిర్ణయాలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 853వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వరంగ సంస్థలను అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి అమ్మే మాత్రం హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందని, వారి ఆటలు ఇక సాగవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుని కుటుంబానికి పరిహారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మృతి చెందిన కాంట్రాక్టు కార్మికుని కుటుంబానికి సాయం అందించడానికి కాంట్రాక్టర్ అంగీకరించారు. మంగళవారం రాత్రి స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో వెల్డింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో సిద్దేశ్వరానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు గొందేశి రాజు మృతి చెందాడు. ఈ అంశంపై బుధవారం హెచ్‌ఆర్ డీజీఎం రాధిక సమక్షంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్ జరిపిన చర్చల్లో కాంట్రాక్టర్ నష్టపరిహారం కింద రూ.1.5 లక్షలు, దహన ఖర్చుల కింద రూ. 25 వేలు చెల్లించడానికి అంగీకరించారు. వీటితో పాటు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు, వర్క్‌మెన్ కాంపెన్సేషన్ రూ.10 నుంచి 13 లక్షలు, లేబర్ వెల్ఫేర్ ఫండ్ రూ. 2 లక్షలు, పీఎఫ్, ఈడీఎల్ కింద నష్టపరిహారం వచ్చేటట్టు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి రవిచంద్రబాబు, వివిధ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు మంత్రి రవి, నందికి తాతారావు, పిట్టా రెడ్డి, నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, గొందేశి సత్యారావు, కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు తిప్పల చక్రధర్‌రెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీజీఎం దృష్టికి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు



స్టీల్‌ప్లాంట్ సీజీఎం మొహంతికి సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉక్కు శ్రామిక సంఘం నాయకులు కోరారు. సీజీఎం (వర్క్స్) బి.కె. మొహంతిని నాయకులు బుధవారం కలిశారు. వారు మాట్లాడుతూ సెంట్రల్ స్టోర్స్‌లో పని చేస్తున్న కొందరు కాంట్రాక్టు కార్మికులను ఏడు నెలలుగా ఆపి వేసి నిర్వాసితుల పొట్ట కొడుతున్నారన్నారు. విభాగం అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని తెలిపారు. ఆపిన వారికి గేటు పాసులు ఇవ్వాలని, 500 నిర్వాసిత కార్మికులకు చెందిన టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కరణం సత్యారావు, కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న దాతలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి రామాలయం వద్ద నూతనంగా నిర్మించనున్న సాయిబాబా, సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయానికి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ బొండా జగన్, పలువురు ఆలయ నిర్మాణ దాతలు సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి హోమం నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు శిగిరిపల్లి రవి, బొండా మహేష్, కనుమరెడ్డి రాజు, మింది పేరయ్య, కర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సినర్జీస్, ఐసీఐసీఐలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

గాజువాక : ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్‌తో పాటు సినర్జీస్ కాస్టింగ్స్‌లో వివిధ ఉద్యోగాల భర్తీకి స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంబీఏ, బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అన్ని తరగతుల్లోను కనీసం 50 శాతం మార్కులను పొంది ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, ఆధార్ కార్డులతో ఉదయం పది గంటలకల్లా శ్రామికనగర్‌లోని తమ కళాశాల ప్రాంగణానికి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

పెన్షనర్ల వినతి



జీవీఎల్ నర్సింహారావుకు వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్ సంఘం నాయకులు

గాజువాక : ఈపీఎస్ 95 పెన్షనర్లకు న్యాయం చేయాలని పెన్షనర్ల సంఘం నాయకులు టి.వి. నాగేశ్వరరావు, ఎ.వి.ఎన్.ఎం.అప్పారావు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావును కోరారు. ఆయన్ను బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యలపై చర్చించుకునేందుకు ఈ నెల 27న నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలని కోరారు. కాగా, పెన్షనర్ల సమావేశానికి హాజరవుతానని, వచ్చేనెలలో రాజ్యసభలో కూడా ఈ సమస్యపై మాట్లాడుతానని జీవీఎల్ నర్సింహారావు హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

ఇష్టానుసారం ఆటోలు నిలిపితే చర్యలు

సింహాచలం : రోడ్లపై ఇష్టానుసారం ఆటోలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ ఆటోడ్రైవర్లకు సూచించారు. 94వవార్డు పరిధి వేపగుంట వద్ద రోడ్డుపై ఆటోలను ఇష్టానుసారం నిలిపి వాహనాల రాకపోకలకు అవాంతరాలు సృష్టిస్తుండటంతో పాటు ప్రయాణికులకు అసౌకర్యం కల్పిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వేపగుంట జంక్షన్‌లో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్‌కు అవాంతరాలు కల్పిస్తే మాత్రం కేసులు నమోదు చేస్తామన్నారు.

పాఠశాలల్లో పండగ వాతావరణం

విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

గాజువాక : విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కిట్ల పంపిణీతో ప్రభుత్వ పాఠశాలల్లో పండగ వాతావరణం నెలకొంటోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతూ విద్యార్థులకు అన్ని విధాలా ప్రోత్సాహాన్నందిస్తుండడంతో తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- 70వ వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను ఆ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ తరహా విద్యను అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాలఘాట్ కృష్ణ, భూషణం, అచ్చిబాబు, బాబులునాయుడు, కె.ఎస్.నాయుడు, చట్టి అప్పలరాజు, చట్టి అప్పలనాయుడు, వాణి, కనక తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక పాత కర్ణవానిపాలెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జేవీకే కిట్లను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సర్వశిక్ష అభియాన్ పథకం ద్వారా ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలవుతోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాంబాయి, స్థానిక నాయకులు సిరసపల్లి అప్పారావు, మాస్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మింది జెడ్పీ హైస్కూల్లో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ గుడివాడ అనూష జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, పీఎంసీ ఉపాధ్యక్షుడు కె.గణపతి, వైఎస్సార్ సీపీ నాయకుడు కె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



70వ వార్డులో కిట్లను అందజేస్తున్న చందు



74వ వార్డులో విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ వంశీ రెడ్డి

కోనవానిపాలెం ఎంపీపీ స్కూల్‌లో ..

పెదగంట్యాడ: 74వ వార్డులోని కోనవానిపాలెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి జగనన్న విద్యాకానుకను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోన అప్పలనాయుడు, ఉరుకూటి అప్పలనాయుడు, దల్లి పైడికొండ, గొందేశి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



మింది జెడ్పీ హైస్కూల్లో జేవీకే కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ అనూష



87వ వార్డులో జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న నాయకులు

కణితి హైస్కూల్లో..

కూర్మన్నపాలెం: 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, ఇతర నాయకుల చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామెదర్, బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకటరమణ, కోమటి రమాదేవి, కాంద్రేగుల అప్పలనాయుడు, ఎన్నేటి రమణ, దుగ్గపు దానప్పలు, పీఈటీ మన్నాజీ, స్కూల్ కమిటీ చైర్మన్ పావాడ లలిత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



వి.హేమసుందర్రావు, ఎంపీడీవో, పరవాడ

పరవాడ: కడప జిల్లాలోని స్పోర్ట్స్ పాఠశాలలో4, 5 తరగతుల్లో చేరేందుకు స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఈ నెల 15 నుంచి 20 తేదీల మధ్య ఎంపికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. బుధవారం పూర్తి వివరాలను ఆయన వెల్లడించారు. క్రీడల్లో వారికున్న ప్రావీణ్యత, ఈవెంట్స్‌లో వచ్చిన మార్కులను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. కడప వెళ్లడానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ పాఠశాలలో రాష్ట్ర వ్యాప్తంగా 4వ తరగతిలో 20 మంది బాలికలు, 20 మంది బాలురను తీసుకోవడం జరుగుతుందన్నారు. 5వ తరగతిలో 11 మందిలో 7గురు బాలురు, 4గురు బాలికలను తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. స్పోర్ట్స్ పాఠశాలలో చేరడానికి అవసరమైన విధి విధానాలను సంబంధిత పీడీలను అడిగి తెలుసుకోవాలని ఎంపీడీవో చెప్పారు.

నేడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సమావేశం

స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో గురువారం 10 గంటలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ వేదిక సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మరిడిమాంబ పండగకు వేళాయె

- కార్మికుల విరాళాలతో గుడి నిర్మాణం
- దేశ విదేశాల నుంచి హాజరు కానున్న భక్తులు



మరిడిమాంబ అమ్మవారు

సింధియా: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కీర్తిగడించిన సింధియా మరిడిమాంబ అమ్మవారి ఆలయానికి దశాబ్దాల చరిత్ర ఉంది. అప్పటి నుంచి ఏటా అమ్మవారి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు సైతం ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారి ప్రధాన పండగను గురువారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయ చరిత్ర

దేశంలో మొట్టమొదటి నౌకా నిర్మాణ సంస్థ సింధియా నేవిగేషన్ కంపెనీగా పేరుగాంచిన నేటి హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థ ముఖద్వారం ఎదుట అమ్మవారు వెలసిందని పూర్వీకుల విశ్వాసం. ఇప్పటి నేవల్ డాక్‌యార్డ్ అప్రంటీస్ స్కూల్ ప్రహరీని ఆనుకుని అమ్మవారి పుట్టమన్ను స్థలం ఉంది. అప్పట్లో రైలు మార్గం గుండా షిప్‌యార్డ్ నిర్మాణానికి వచ్చే ఉత్పత్తులకు మొదట అమ్మవారి మందిరం వద్ద పూజలు చేసేవారని చెబుతుంటారు. రైలు మార్గం గుండా తరలివచ్చే కూరగాయలు, పలు రకాల ముడి సరుకులు నగరంలోని పాతపోస్టాఫీస్‌కు తరలించేందుకు దుర్గాబీచ్ నుంచి ఫెర్రీ(నీటిపై తేలియాడే తాళ్లతో కట్టిన కర్రల వంతెన) ద్వారా తరలించేవారు. అప్పట్లో సింధియా నేవిగేషన్ కంపెనీలో సుమారు 5వేల మంది కార్మికులు పనిచేస్తుండేవారు. 1944 సంవత్సరంలో ఆ ప్రాంతంలో అమ్మవారు తిరుగాడేవారని కార్మికులు అంటున్నారు. 1952లో ఓ రోజు రాత్రి వేళలో పట్టీల శబ్దంతో అమ్మవారు కార్మికులకు కనిపించారని, ఆ తల్లి కోరిక మేరకు ఆ ప్రదేశంలో చిన్నపాటి పూరిపాక నిర్మించి రాతినే అమ్మవారి ప్రతిరూపంగా నెలకొల్పినట్లు చెబుతుంటారు. అప్పటి షిప్‌యార్డ్ కార్మిక నాయకులు పిల్లా వీరన్న, శరగడం అప్పలనాయుడు, పిల్లా అప్పారావు, డిల్లాడ అప్పన్న తదితర కాలనీ పెద్దలు గుడి నిర్మాణానికి నాంది పలికారు. దీంతో అప్పటి షిప్‌యార్డ్ సీఎండీ కమొడోర్ లిల్లీ సహకారంతో అమ్మవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి కార్మికులంతా తమ ఒకరోజు వేతనం విరాళంగా ఇచ్చారు. ఆలయ గోపురం, ముందుపెంకుతో మండపాన్ని నిర్మించారు. కాలనీ వ్యాపారులు గూడేల బాబూరావు, మిల్లు రంగబాబు తో పాటు దేశ విదేశాల్లో స్థిరపడిన వారి కుటుంబసభ్యులు అమ్మవారి ఉత్సవాలను ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరిపిస్తుంటారు. షిప్‌యార్డ్‌ను నౌకాదళ రక్షణ రంగంలో విలీనం చేయడంతో ఉద్యోగులు, కాలనీవాసుల సంఖ్య తగ్గిపోవడంతో కొన్నేళ్లుగా అమ్మవారి ఉత్సవాలను కాలనీ పూర్వీకులే నిర్వహిస్తున్నారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన మహాశివుని విగ్రహం



ఉత్సవాల సందర్భంగా ముస్తాబైన ఆలయం

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

సుదీర్ఘ చరిత్ర గల సింధియా మరిడిమాంబ అమ్మవారి పండగ ఈనె 7వ తేదీ ప్రారంభమైంది. గురువారం పండగ ముగింపు మహోత్సవంలో భాగంగా అమ్మవారికి వేకువజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం జాతర మహోత్సవం నిర్వహిస్తారు. అనుపుమహోత్సవాన్ని భారీ బాణసంచా నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అజయ్, కె.లక్ష్మణరావు, జోగారావు ఏర్పాట్లు చేశారు.

రక్తదానం అభినందనీయం



రక్తదాతలకు జ్ఞాపికలు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్

- ఒకరి రక్తదానంతో ముగ్గురి ప్రాణాలను కాపాడగలం
- స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్
- శిబిరంలో 564 యూనిట్ల రక్తం సేకరణ

ఉక్కునగరం: రక్తదానం అభినందనీయమని, ఒకరు రక్తదానం చేయడం ద్వారా ముగ్గురి ప్రాణాలను కాపాడగలమని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. ఉద్యోగులు ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా సంస్థకు సమాజంలో మరింత గౌరవం పెరుగుతుందన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. రెడ్‌క్రాస్, లైఫ్ షేర్, లయన్స్ క్లబ్, రక్త నిధి సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 564 యూనిట్లు సేకరించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె. రామ్మూర్తి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రక్తదానం కార్యక్రమం నిర్వహించడం మంచి ఆశయమన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తర్ మహ్మద్ అనీఫ్, స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, వై.టి. దాస్. యు.రామస్వామి, వివిధ కార్మిక సంఘాల నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె. రామకృష్ణ, వై. మస్తానప్ప, డి.వి. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ స్టీల్‌సిటీ సహకారంతో సీఐఎస్ఎఫ్ బ్యారక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని యూనిట్ కమాండెంట్ అత్తర్ మహ్మద్ అనీఫ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత రక్తదానంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో 35 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో ఉప కమాండెంట్ నవీన్, సీఐఎస్ఎఫ్ అధికారులు, జవాన్లు పాల్గొన్నారు.

రక్తదానంతో మరింత చురుకుదనం

అగనంపూడి: రక్తదానం చేయడం వల్ల మరింత చురుకుదనం కలుగుతుందని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష, సివిల్ సర్జన్, ఆర్ఎంవో డాక్టర్ జె.భారతి అన్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో ఏపీవీవీపీ జిల్లా కో–ఆర్డినేటర్ రమేష్ కిషోర్ ఆదేశాల మేరకు స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రక్తదానం వల్ల ఆరోగ్యం మరింత మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో 30 మంది పాల్గొనగా, 15 బ్యాగ్‌ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ వి.అశోక్‌కుమార్, డాక్టర్ ఆశాలత, గోపీకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నక్కా రమణబాబు, ల్యాబ్ ఇన్‌చార్జి పిల్లా రాజశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఆర్ఎంవో డాక్టర్ భారతి



లయన్స్‌క్లబ్ ప్రతినిధులకు జ్ఞాపిక అందజేస్తున్న కమాండెంట్ అనీఫ్

కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద

మహారాణిపేట : పది, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు శ్రద్ధ అసోసియేషన్ పురస్కారాలు అందజేసింది. బుధవారం 20 మంది పిల్లలకు ఆర్థిక పురస్కారం, మరో 10 మంది పిల్లలకు కాలేజీ బ్యాగులను సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద ద్వారా అందజేసింది. శ్రద్ధ అసోసియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి. సాగర శిరిజ మాట్లాడుతూ శానిటరీ ఉద్యోగుల పిల్లలు, సెక్యూరిటీ ఉద్యోగుల పిల్లలకు నగదు ప్రోత్సాహకాలు, కాలేజీ బ్యాగులు అందజేశామని తెలిపారు. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బి. సమీర్ సౌరభ్ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్న పిల్లలకు అవసరమైన సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షుడు బి. జగదీశ్, కేజీహెచ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్. అప్పారావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం స్వామికి తిరువీధి నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.